## ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

నిర్మానుష్యంగా ఉన్న రహదారి

**ఆచంట :** మే నెలలో విపరీతమైన ఎండలు కాస్తాయని ప్రజలంతా భావించినప్పటికీ ఏడాది వాతావరణ పరిస్థితులు భిన్నంగా మారాయి. దీంతో ప్రజలు, రైతులను అయోమయానికి గురిచేశాయి. వర్షాలకు ఒక్కసారి వాతావరణంలో పలు మార్పులు సంభవించి వాతావరణం కాస్త చల్లబడటంతో ప్రజలు కాస్త ఉపసమనం పొందారు. అదే సమయంలో రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆది, సోమవారాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం వేడెక్కింది. ఉదయం 11 గంటల నుంచి మండలంలో వడగాల్పులతో పాటు ఉష్ణోగ్రతలు సుమారు 40 డిగ్రీల వరకు నమోదైయ్యాయి. దీంతో ప్రధాన రహదారులు మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా మారాయి.

# కొల్లేరు ప్రజలకు న్యాయం జరిగేనా..!

- కొల్లేరు ప్రాంత ఎంఎల్ఎలు, అధికారులతో సిఎం సమీక్ష
- 20 వేల ఎకరాల జిరాయితీ, డిఫారం పట్టా భూములపై చర్చ
- మరో రెండు వారాల్లో కొల్లేరుకు రానున్న సిఇసి కమిటీ
- మూడో కాంటూరుకు కుదింపుపై మరోసారి అసెంబ్లీ తీర్మానం చేసేనా?
- కొల్లేరు కాలుష్యం, ఉప్పుటేరు ఆక్రమణలపై దృష్టి పెట్టాలని సిఎం ఆదేశం

ఎంఎల్ఎలు, అధికారులతో కొల్లేరుపై సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

కొల్లేరు సమస్యను త్వరితగతిన పరిష్కరించి తమకు న్యాయం చేయాలంటూ అక్కడి ప్రజలు దశాబ్దాలుగా కోరుతున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు హామీ ఇవ్వడం, గెలిచిన తర్వాత హడావుడీ చేసి ఐదేళ్లు గడిచేసరికి ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం పరిపాటిగా మారుతోంది. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కొల్లేరు ప్రజలంతా ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. జిరాయతీ, డిఫారం పట్టా భూములను అప్పగించడంతోపాటు, కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, చేపల చెరువుల ధ్వంసాన్ని నిలుపుదల చేయాలని కొల్లేరు ప్రజలంతా ప్రజా ప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామంటూ కూటమి ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా కొనసాగుతోంది. చేపల చెరువుల ధ్వంసాన్ని నిలుపుదల చేయాలంటూ కొల్లేరు రైతులు కోరుతున్నా అటవీశాఖ అధికారులు చెరువులను ధ్వంసం చేస్తూనే ఉన్నారు. చేపల చెరువులను ధ్వంసం చేయడంతో చెరువుల్లోని నీరు పంటపొలాల్లో పడి వరిరైతులు సైతం తీవ్ర నష్టాలను చూసిన పరిస్థితి సైతం రబీలో కొనసాగింది. ఇప్పటికే ఒకసారి సిఎం సమక్షంలో కొల్లేరుపై సమావేశం జరిగినప్పటికీ అధికారుల తీరులో మాత్రం మార్పులేకుండా పోయింది. కొల్లేరుపై సోమవారం సిఎం చంద్రబాబు మరోసారి కొల్లేరు ప్రాంత ఎంఎల్ఎలు చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, కామినేని శ్రీనివాస్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, చీఫ్ సెక్రటరీ విజయానంద్‌తో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి అటవీశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 20 వేల ఎకరాల జిరాయితీ, డిఫారం పట్టా భూములతోపాటు, కొల్లేరు కాలుష్యం, ఉప్పుటేరు ఆక్రమణలపై సిఎం చర్చించారు. మూడో కాంటూరు కుదించాలంటూ గతంలో అసెంబ్లీ తీర్మానం జరిగింది. కొల్లేరు మూడో కాంటూరుకు కుదింపుపై మరోసారి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలంటూ కొల్లేరు ప్రజల్లో చర్చ నడుస్తోంది. రెండు వారాల్లో సిఇసి (సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ) కొల్లేరులో పర్యటించనుంది. కొల్లేరు ప్రజల సమస్యలను, ప్రభుత్వ నిర్ణయాలను గట్టిగా చెప్పగలిగితేనే కొల్లేరులో ఉన్న మూడు లక్షల మంది ప్రజానీకానికి న్యాయం జరుగుతోంది.

**సిఎం చర్చలో కీలక అంశాలు ఇవే..**

పర్యావరణ పరంగా కీలకమైన కొల్లేరు సరస్సును పరిరక్షించుకోవాల్సిన అవసరంతోపాటు, అదే సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న ప్రజల సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చ సాగింది. కొల్లేరుపై కోర్టు తీర్పులు, నిబంధనలు, కేంద్ర సంస్థల ఆదేశాలు, స్థానిక పరిస్థితులు, పర్యావరణ, కాంటూరు అంశాలపై చర్చించారు. కొల్లేరు పరిధిలో మూడు లక్షల మంది ప్రజలు ఉన్నారని, చాలా కాలంగా వీరు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చర్చలో ప్రజాప్రతినిధులు తెలిపారు. 2018లో నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు 20 వేల ఎకరాల జిరాయితీ, డీపట్టా భూములను కొల్లేరు పరిధి నుంచి మినహాయించి కొత్త సరిహద్దులను నిర్ధారించాలని చెప్పిందంటూ చర్చల్లో వచ్చింది. ఈ మేరకు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి సిఫార్సు కూడా చేసింది. అయితే దీనిపై కొందరు అభ్యంతరాలు చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరిందని, గత వైసిపి ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదంటూ చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. 'కొల్లేరు పరిధిలో 20 వేల ఎకరాల జిరాయితీ, డీపట్టా భూములు ఉన్నాయని, కాంటూరు సమస్య నేపథ్యంలో ముందుగా వీరికి న్యాయం జరిగేలా చూడాలని సమావేశంలో చర్చ సాగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సిఇసి, సుప్రీంకోర్టు ముందు ఉంచి వారిని ఒప్పించాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. అదే సమయంలో కొల్లేరు కాలుష్యంపై సమావేశంలో చర్చ జరిగింది. కొల్లేరులోకి వెళ్తున్న డ్రెయిన్ వాటర్‌కు ట్రీట్మెంట్ జరగాలని, విచ్చలవిడిగా డ్రెయిన్లు వదిలేసి కొల్లేరును కాలుష్యమయం చేసే ప్రక్రియకు బ్రేక్ వేయాలని నిర్ణయించారు. డ్రెయిన్‌లో పూడికలు తొలగించి నీరు సులువుగా వెళ్లే అవకాశం కల్పించాలన్నారు. కొల్లేరు నుంచి నీటిని సముద్రంలోకి తీసుకెళ్లే ఉప్పుటేరు ఆక్రమణలను తొలగించడంతోపాటు, ఉప్పుటేరు పూడికతీసి నీరు సముద్రంలోకి వెళ్లేలా చేయాలని నిర్ణయం జరిగింది. అవుట్ లెట్లు పూర్తిగా క్లియర్ చేయాలని, ఈ పనులకు అవసరమైన అంచనాలు రూపొందించి పనులు ప్రారంభించాలని నిర్ణయించారు.

## అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

**కలెక్టర్ చదలవాడ నాగరాణి**

ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగరాణి

**ప్రజాశక్తి - భీమవరం**

పిజిఆర్ఎస్ ద్వారా అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ నాగరాణితోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు జిల్లా నలుమూలలా ప్రజల నుంచి వచ్చిన 137 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రజల వద్ద నుండి స్వీకరించిన అర్జీలు వాటి పరిష్కారనికి తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతి సమస్యనూ త్వరగా పరిష్కరించేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. పదేపదే అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిజిఆర్ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్ అప్పారావు, అధికారులు, వయోవృద్ధుల సంక్షేమం ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో శశి విద్యార్థికి 16వ ర్యాంకు

16వ ర్యాంకు సాధించిన షేక్ అజీమ్ ఖాన్

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తాడేపల్లిగూడెం శశి విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారని శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షేక్ అజీమ్ ఖాన్ ఆల్ ఇండియాలో 16వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఎ.ప్రసాద్ 4111వ ర్యాంకు, శ్రీలేఖ 4915, చరణ్ 6058, దేవిక 6637, హరి చరణ్ 12259 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు అధ్యాపకులను శశి విద్యా సంస్థల ఛైర్మన్ గోపాలకృష్ణ, వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర, అకాడమిక్ డైరెక్టర్ క్రాంతి సుధ అభినందించారు.

**పెనుమంట్ర :** మండలంలోని నెలమూరు గ్రామానికి చెందిన విద్యార్థి పాతపాటి వెంకట వివేకవర్మ జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఓపెన్ కేటగిరిలో 1503 ర్యాంక్, కేటగిరిలో 132 ర్యాంకు సాధించాడు. సోమవారం ఈ సందర్భంగా వివేకవర్మ తండ్రి శ్రీనివాసరాజు (వర్మ) విలేకరులతో మాట్లాడుతూ తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. వివేక వర్మ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ రాజమండ్రి తిరుమల కళాశాలలో చదివానని, ఇంటర్‌లో 976 మార్కులు సాధించానని తెలిపారు. జెఇఇ మెయిన్స్‌లో కూడా 699 ర్యాంకు వచ్చిందని తెలిపాడు. తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడమే లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపాడు. వివేకవర్మకు గ్రామ సర్పంచి కుచ్చర్లపాటి వెంకటపతి రాజు మంగ తాయారు, ఎంపిటిసి నాగరాజు వెంకట్రామరాజు, లక్ష్మి, గొట్టుముక్కల భాస్కరవర్మ, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు తదితరులు అభినందించారు.

## పశ్చిమను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

**కలెక్టర్ చదలవాడ నాగరాణి**

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

**ప్రజాశక్తి - భీమవరం**

జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీతో సమావేశమై బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జూన్ 12వ తేదీన ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని ఏటా జరుపుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జూన్ 1 నుంచి 30 వరకూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టేందుకు జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాల కార్మికులను రక్షించడం, పాఠశాల విద్య సమర్థవంతమైన పునరావాసం కోసం లైన్ విభాగాల ప్రతినిధులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, పోలీసు, విద్య, మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, సాంఘిక సంక్షేమ శాఖలు, జిల్లా న్యాయ సేవా అథారిటీ, బాలల రక్షణ అధికారి, చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థలు, బిబిఎ వంటి సంబంధిత లైన్ విభాగాలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కమిటీ సభ్యులందరి సమన్వయంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులతో పాటు కార్మిక శాఖ అధికారులు రైల్వే స్టేషన్లు, హోటళ్లు, దాబాలు, బార్లు, రెస్టారెంట్లు, ఇటుక బట్టీలు, దుకాణాలు, సంస్థలు, భవనాలు తదితర చోట్ల 14 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను నియమించడాన్ని, 15 నుండి 18 ఏళ్ల వయస్సు గల కౌమార దశ కార్మికులను గుర్తించాలన్నారు. జిల్లాలో ఎటువంటి డ్రాపౌట్స్ లేకుండా చూసుకోవాలని, విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి బిడ్డ పాఠశాలలో ఉండేలా చూడాలని విద్యా శాఖను ఆదేశించారు. 30 వరకూ బాల కార్మికుల గుర్తింపు, విడుదల, రక్షణ, పునరావాసం కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ మూడో తేదీ నుంచి 27వ తేదీ వరకూ పలు ప్రాంతాల్లో బాల కార్మిక వ్యవస్థ చట్టాలు, శిక్షలు, అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకన లక్ష్మి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## తిరుమల విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న తిరుమల డైరెక్టర్లు సాయిరాజు, శ్రీనివాసవర్మ

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో భీమవరం తిరుమల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారనితిరుమల విద్యా సంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. పిజె.హర్షవర్ధన్ ఆల్ ఇండియాలో 243వ ర్యాంకు, బి.హరిరామ్ 567వ ర్యాంకు, వి.సాయివల్లభ్ 739వ ర్యాంకు, జి.నిఖిల్‌వర్మ 868వ ర్యాంకు, ఎల్.రోహిత్ 910వ ర్యాంకు, సిహెచ్.వినిన్ 912వ ర్యాంకు, కె.శివ 936వ ర్యాంకు, ఎం.సాయి చరణ్ 949వ ర్యాంకు, డి.ప్రణవి 974వ ర్యాంకు సాధించారని తెలిపారు. వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన వారు తొమ్మిది మంది, 2000లోపు 17 మంది, 3000లోపు 23 మంది, 5000 లోపు 43 మంది, 10000లోపు 60 మంది, 15000లోపు 66 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని సంస్థ డైరక్టర్స్ ఎన్.సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ, జి.సతీష్‌బాబు అభినందించారు.

## ఉపాధి కూలీల వేతన బకాయిలు చెల్లించాలి

**వ్యవసాయ కార్మిక సంఘం నేతలు**

పెనుగొండ :మాట్లాడుతున్న వ్యకాస జిల్లా కార్యదర్శి జె.సత్యనారాయణ

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

ఉపాధి కూలీలకు వరంలా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రభుత్వం నీరుగారుస్తుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు పేర్కొన్నారు. ఉపాధి పర్యటనలో భాగంగా సోమవారం కొత్తూరు గ్రామంలోని పని ప్రదేశంలో ఆయన కూలీలతో మాట్లాడారు. కూలీలు సమస్యలు అడిగినప్పుడు ఉపాధి బకాయిలు ఇవ్వడం లేదని, తక్షణమే ఉపాధి డబ్బులు ఇప్పించాలని వారు కోరారన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఉపాధి కూలీల వేతన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత ఎనిమిది వారాలుగా పనిచేస్తున్న కూలి వేతనాలు పడలేదని, కూలి వేతనాలు తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధికూలీల సమస్యల మీద నిరంతరం పనిచేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘంలో వ్యవసాయ కూలీలందరూ సభ్యులుగా చేరి వ్యవసాయ కార్మిక సంఘాన్ని బలోపేతం చేస్తేనే ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోగలమని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గోపిశెట్టి సూర్యనారాయణ, కొండపల్లి గణేష్ రావు, మాసాబత్తుల రాము, గోపీ, చిట్టి, సుబ్బారాయుడు, బండారు గంగమ్మ, గోపిశెట్టి దుర్గాభవాని, కోడే గంగమ్మ, ఉప్పు దుర్గ, ఇళ్ల సుబ్బారావు, బాదం సీతయ్య, రాయి గంగరాజు, ఉప్పు అన్నవరం మాట్లాడారు.

**పోడూరు :** ఉపాధి కార్మికుల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉపాధి పర్యటనలో భాగంగా పెనుమదంగ్రామ కూలీలను కలసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పనైనా చూపండి.. తిండైన పెట్టండి అని వామపక్ష పార్టీల పోరాటం ద్వారా ఈ పని వచ్చిందన్నారు. పనిప్రదేశంలో మందులతో ప్రాథమిక వైద్యం పెట్టె ఏర్పాటు చేయాలన్నారు. పని ప్రదేశంలో దెబ్బ తగిలితే మస్తరు వేసి వేతనం చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించకుండా ఉపాధి పని నిర్వీర్యం చేయాలని చూస్తుందని విమర్శించారు. కేరళలోలా 200 రోజులు పని కల్పించి రూ.800ల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటలక్ష్మి, కౌరు శ్రీను, వరలక్ష్మి పాల్గొన్నారు.

**పెనుగొండ :** ఉపాధి కూలీలకు వేతనాలు పడకపోతే ఏమి తిని పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి షేక్ పాదుషా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలంలోని ఇలపర్రు, ములపర్రు గ్రామాల్లో పని చేస్తున్న కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, పాదుషా మాట్లాడుతూ గతంలో అనేక ఆందోళన, పోరాటాల ఫలితంగా మార్చి 15 వరకు వేతనాలు విడుదల చేశారని, ఆ తరువాత ఎటువంటి చర్యలు లేవన్నారు. కష్టపడి పనిచేస్తూ బతకటానికి అప్పులు చేసుకొని తినాల్సి వస్తుందన్నారు. ఈనెల 1 నుంచి వడగాల్పులు ప్రారంభమయ్యాయని, ఫొటోలు కోసం ఇబ్బంది పెట్టకుండా, వడగాల్పులకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో పవన్ కళ్యాణ్ స్పందించి వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, లేనియెడల కూలీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ఉపాధి పనులు చూపక వ్యవసాయ కార్మికులకు పనులు దొరకటం లేదని, ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి షేక్ బాదుషా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్, మే నెలల్లో వెంకట్రాంపురం గ్రామంలో ఒక్కరోజు కూడా ఉపాధి పని చూపని దుస్థితి దాపరించిందన్నారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి పని చూపాలని డిమాండ్ నోటీసును గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్మికులు అందజేశారు.

**అత్తిలి:** ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు కూలీలు ఐక్యం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. సోమవారం ఉపాధి హామీ పర్యటనలో భాగంగా మండలంలోని స్కిన్నెర పురం గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పరిరక్షణ కోసం వ్యవసాయ కార్మిక సంఘం చేసే ఉద్యమ పోరాటాలలో కూలీలందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ రాణి, తొత్తర మూడి రాంబాబు, యార్లగడ్డ కుమారి, ఉల్లంపర్తి హారిక, యార్లగడ్డ లైలావతి, సురేష్, కుమారి పాల్గొన్నారు.

**భీమవరం టౌన్ :** ఉపాధి వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రూరల్‌లోని వెంప గ్రామంలో సోమవారం ఉదయం ఉపాధి పని ప్రాంతానికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి చట్టానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్ధనపు కృపవరం, పెదపాటి కరుణకుమారి, భూపతి శామేలు, చిలకపాటి చిరంజీవి, మీసరపు ప్రసన్న, మంద మార్తమ్మ, చిలకపాటి ఆనందరావు, మండ జగపతి, బాణం సక్కుబాయి, అప్పల నరసమ్మ పాల్గొన్నారు.

## ఆస్తి పెంపు తీర్మానాన్ని రద్దు చేయాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు**

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

కూటమి ప్రభుత్వం పట్టణ ప్రజలపై ఆస్తి పన్ను భారాలు పెంచుతూ చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రూ.కోటీ 50 లక్షల ఆస్తి పన్నుదారులపై రూ.784 కోట్ల భారాన్ని పెంచుతూ ఆర్థిక సంవత్సరానికి నిర్ణయం తీసుకుందని ఆయన వాపోయారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతి సంవత్సరమూ 15 శాతం ఆస్తి పన్నులు పెంచుకొనే విధంగా నిర్ణయం తీసుకున్నారని, ఆ ప్రకారం రూ.320 కోట్ల పట్టణ ఆస్తిపన్ను దారులు ప్రతి సంవత్సరం చెల్లించాల్సి ఉంటుందన్నారు. గత ప్రభుత్వం ప్రతి సంవత్సరం 15 శాతం పన్ను కూటమి ప్రతి సంవత్సరం మరో 20శాతం పన్నులు పెంచి మొత్తం 35 శాతం వసూలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. దాదాపు రూ.820 కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపిందని, ఈ విధానాలను సిపిఎం తరుపున ఖండిస్తున్నామని తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణంలో రూ.మూడు కోట్ల పన్నుల భారాలు మోపాలని చూస్తుందన్నారు. ఈ ఆస్తి పన్నుల భారాలను వెనక్కి తీసుకోకపోతే దశలవారీ ఆందోళన, నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహించి కూటమి ప్రభుత్వానికి తగు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, కమిటీ సభ్యులు జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## క్షయను అంతం చేయడమే లక్ష్యం : కలెక్టర్

**పెనుగొండ :** జిల్లాలో క్షయ వ్యాధిని అంతం చేయడమే లక్ష్యంగా పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం పెనుగొండ మండలం సిద్ధాంతం టిబి యూనిట్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'ప్రధానమంత్రి ఇంటెన్సిఫైడ్ టిబి ముక్త్ భారత్ క్యాంపెయిన్'ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా 60 సంవత్సరాలపైబడిన వారు, షుగర్ పేషెంట్స్, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, ఆల్కహాల్ తీసుకునేవారు, స్మోకర్స్, గతంలో టిబి వ్యాధి బారిన పడినవారు, టిబి వ్యాధిగ్రస్తుల ఇళ్లలో వున్నవారు వీరంతా పరీక్షలు చేయించుకోవాలని, మన దేశాన్ని క్షయ వ్యాధి లేని దేశంగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాం కింద ఎవరైనా సరే టిబి పేషెంట్లకు పౌష్టికాహారాన్ని అందజేయడానికి దత్తత తీసుకోవచ్చని, దీనికి తొలుత 'నిక్షయమిత్ర'గా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా కోరారు. చివరిగా జిల్లా కలెక్టర్ దత్తత తీసుకున్న 25 మంది క్షయరోగుల పౌష్టికాహార ఖర్చుకు సంబంధించిన చెక్కును డిప్యూటీ డిఎంహెచ్ఒకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ జి.గీతబాయి, అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ బి.భానునాయక్, నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, పంచాయతీ ప్రెసిడెంట్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సుప్రియ, డాక్టర్ సత్య పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ తగదు

**రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన నిరసన**

**తాడేపల్లిగూడెం :** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని, స్టీల్ ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించాలని కోరుతూ తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ నిరసన తెలియజేసింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ అధ్యక్షులు సత్తి కోదండరామిరెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ 1977లో విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమాలు, పోరాటాలు జరిగాయని, ఆ పోరాటంలో 32 మంది బలిదానంతో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ వచ్చిందన్నారు. వామపక్ష పార్టీలకు సంబంధించిన ఎంపీలు, ఎంఎల్ఎల రాజీనామాలతో ప్రభుత్వం దిగివచ్చి 1977లో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కి రూ.5 కోట్లు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, ఆరు మండలాలు, 58 గ్రామాల ప్రజలు 26 వేల ఎకరాల భూమిని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు తక్కువ ధరకు విక్రయించారన్నారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం భూములిచ్చిన నిర్వాసితులకు ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం కల్పిస్తామని ఆశ చూపించినప్పటికీ సగం మందికి కూడా ఉద్యోగాలు రాలేదని తెలిపారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో సుమారు లక్షా 50 వేల మంది పనిచేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం సొంత గనులు ఇవ్వనప్పటికీ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లాభాల్లో నడుస్తుందని వారు తెలిపారు. అయినా ప్రభుత్వానికి 46 వేల కోట్లు రూపాయలు జమ చేసిందని, 2020-21 కరోనా కాలంలో ఆక్సిజన్ తయారుచేసి అనేకమంది ప్రజల ప్రాణాలు నిలిపిందని వారు చెప్పారు. ఐదు కోట్ల పెట్టుబడితో నిర్మితమైన ఫ్యాక్టరీ సుమారు మూడు లక్షల కోట్ల రూపాయలు ఆస్తిగా అభి వృద్ధి చెందిందని ఇటువంటి ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం కావాలని దక్షిణ కొరియాలో ఉన్న పోస్కో కంపెనీకి, మన దేశంలో ఉన్న బడ పారిశ్రామిక వేత్తలకు కారు చౌకగా కట్టబెట్టడానికి ప్రయత్నిస్తుందని తెలిపారు. సుమారు నాలుగు సంవత్సరాల నుంచి కార్మికులు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణ కాకుండా పెద్ద ఎత్తున ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తున్నారని అయినా సరే ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా నాలుగు వేల మంది ప్రయివేట్ కార్మికులను పని నుంచి తొలగించిందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు, పోరాటాలు జరుగుతున్నాయని వారు తెలిపారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం తొలగించిన ఆ నాలుగు వేల మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, పూర్వ వైభవంగా దాన్ని కొనసాగించాలని వారి డిమాండ్ చేశారు. కర్రిసాయి రెడ్డి, కర్రి శ్రీనివాస్ రెడ్డి, అడపా ఆంజనేయులు, బుద్దాల నాని, కర్రి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## తాడేరు గ్రామాభివృద్ధికి కేంద్రమంత్రి హామీ

**భీమవరం టౌన్ :** తాడేరు గ్రామంలోని రక్షిత మంచినీరు అందించేందుకు మైక్రో ఫిల్టరేషన్, శ్మశాన వాటిక అభివృద్ధికి కేంద్రం నుంచి నిధుల మంజూరుకు కేంద్రమంత్రి, ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ హామీ ఇచ్చారు. సోమవారం భీమవరంలోని ఆయన కార్యాలయంలో తాడేరు గ్రామస్తులు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. తాడేరు గ్రామం భీమవరం మున్సిపాలిటీ విలీన గ్రామాలలో భాగమై ఉండటంతో జల జీవన్ మిషన్ లాంటి పథకాలకు అర్హత కోల్పోయిన విషయాన్ని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో రక్షిత మంచినీటి సమస్య, శ్మశాన వాటిక అభివృద్ధి, డ్రెయినేజీ వ్యవస్థ లోపాలను వివరిస్తూ జనసేన నాయకులు బండి రమేష్, బిజెపి నాయకురాలు హేమలక్ష్మి కేంద్రమంత్రి వర్మకు వినతి పత్రం అందించారు. వెంటనే స్పందించిన మంత్రి వర్మ నీటిపారుదల శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి మైక్రో ఫిల్టరేషన్ ఏర్పాటుకు అంచనాలు రూపొందించి పంపాలని ఆదేశించారు. అంతేకాకుండా శ్మశాన వాటిక అభివృద్ధికి ఎంపీ నిధులు లేదా సిఎస్ఆర్ ఫండ్స్ నుంచి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

## పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

నగదు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

నిరుపేద విద్యార్థిని చదువుకు ఆర్థిక సహాయం అందించడానికి దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకటరామరాజు ముందుకు వచ్చారు. ఏలూరుపాడు గ్రామానికి చెందిన గంధం వెంకటేశ్వరరావు కుమార్తె కృప కుసుమ డిఎన్ఆర్ కాలేజీలో సిఎస్‌సి ఫస్ట్ ఇయర్ చదువుతుంది. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు ముందుకు వచ్చి ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు చేతుల మీదుగా రూ.5 వేల నగదు ఆర్థిక సహాయం సోమవారం అందించారు.

## డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

**కాళ్ల :** మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు అండర్ గ్రౌండ్ డ్రెయిన్, సిమెంట్ డ్రెయినేజీ నిర్మాణ పనులు పంచాయతీ, జెడ్‌పి నిధులతో చేపడుతున్నామని కాళ్ల ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎ.ఫణి సోమవారం తెలిపారు. బొండాడ గ్రామంలో మురుగునీరు తరలింపునకు రూ.5 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. గ్రామంలో వాడకం నీరు నేరుగా పంట కాలువలో కలవడంతో శివారు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలువురు టిడిపి నాయకులు ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు దృష్టికి వెళ్లడంతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలని స్థానిక నాయకులు కోరారన్నారు. మురుగు కాలువలో కలిసే విధంగా పైపులు, తూములతో సుమారు 220 మీటర్ల మేర డ్రెయినేజీ నిర్మాణం చేపడుతున్నట్లుగా ఎఇ ఎ.ఫణి తెలిపారు. అదేవిధంగా బొండాడ పేటలో సిమెంట్ డ్రెయినేజీ నిర్మాణానికి జెడ్‌పి నిధులు రూ.20 లక్షలతో, సిసలి గ్రామంలో జెడ్‌పి నిధులు రూ.20 లక్షలతో, మేకలదిబ్బ ప్రాంతంలో జెడ్‌పి నిధులు రూ.20 లక్షలతో పనులు చేపడతామన్నారు.

## బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి : ఎంఎల్ఎ

**భీమవరం టౌన్ :** విద్య అనేది ప్రాథమిక హక్కు అని, బడిఈడు పిల్లలంతా బడిలో ఉండాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో సోమవారం బడిఈడు పిల్లలంతా బడిలో ఉండాలంటూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ చదువుకు దూరమైన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని, 6 నుంచి 14 ఏళ్ల లోపు గల బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు.

## టిసిఎస్‌లో ఉద్యోగాలకు ఆదిత్య విద్యార్థుల ఎంపిక

**తాడేపల్లిగూడెం :** ఆదిత్య అంటేనే ఉద్యోగాల గని అని, ఆదిత్య డిగ్రీ కళాశాలలో మరొక్కసారి ఆదిత్య విద్యార్థులు ఐటి ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఐటీ ఉద్యోగాలు రావడం చాలా కష్టతరంగా మారిందని, విద్యార్థి క్యాంపస్ డ్రైవ్‌లో సాధిస్తేనే తప్ప ఉద్యోగాలు రావటం అనితర సాధ్యమన్నారు. అయినా కూడా తమ ఆదిత్య ప్రతిష్ఠమైన ప్రణాళిక వల్ల ఇది మరొకసారి సాధ్యపడిందని ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ తెలిపారు. టిసిఎస్ ఐటిలో 16 మంది ఉద్యోగం సాధించారని, ఇంకా 8 మందికి హెచ్ఆర్ రిజల్ట్ రావాల్సి ఉందన్నారు. ఈ విద్యా సంవత్సరం ఇప్పటికి 487 ఉద్యోగాలు సాధించామని, ఇంకా కొన్ని డ్రైవులు జరుగుతున్నాయని స్థానిక డైరెక్టర్ కె.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఐటి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ ఎన్.సుగుణ రెడ్డి అభినందించారు.

## 'వెన్నుపోటు దినం'ను విజయవంతం చేయాలి

**ఆచంట :** ఈనెల 4న జరగబోయే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి సీనియర్ నేతలు సుంకర సీతారామ్, జక్కంశెట్టి చంటి, కోట వెంకటేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఈనెల 4కి సంవత్సరం అవుతుంది. ఈ సంవత్సరకాలంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకపోవడంతో ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాన్ని ఖండిస్తూ వైసిపి అధినేత జగన్ ఆదేశాల మేరకు నిరసన కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో సర్పంచిలు బోడపాటి బుల్లియ్య, జక్కంశెట్టి శ్రీరాములు, వైసిపి నాయకులు ముత్యాల నాగేశ్వరరావు, పిల్లి రుద్రప్రసాద్, యల్లమెల్లి రాజేష్, కొండేటి భవాని ప్రసాద్, బులా ప్రసాద్ పాల్గొన్నారు.

**యలమంచిలి :** వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి) ఆదేశాలు మేరకు సోమవారం మండలంలోని దొడ్డిపట్ల గ్రామంలో ఈనెల 4న జరిగే వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి గుర్తుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైసిపి అధ్యక్షులు ఉచ్చుల స్టాలిన్ బాబు, నిమ్మకాయల రామకృష్ణ, ఇనుకొండ రవికుమార్, ఒదూరి భాస్కరరావు పాల్గొన్నారు.

## 'అభివృద్ధి పథంలో నవ్యాంధ్ర, స్వర్ణాంధ్రకు సన్నద్ధం'

**భీమవరం టౌన్ :** అభివృద్ధి పథంలో నవ్యాంధ్ర, స్వర్ణాంధ్రకు సన్నద్ధమవుతుందని పలువురు వక్తలు అన్నారు. భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద సోమవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా ఏర్పడిన దినోత్సవాన్ని నిర్వహించారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్, సభ్యులు కె.చంద్రరావు మాట్లాడుతూ 2014 జూన్ 2న నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడిందని, మన రాష్ట్రంలోంచి తెలంగాణ విడిపోయి నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడి దినదినాభివృద్ధి సాధిస్తున్నామన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. మాజీ కౌన్సిలర్లు విజ్జురోతి రాఘవులు, కొండ్రు శ్రీనివాస్, భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## చంటి రాజు కుటుంబానికి పరామర్శ

**భీమవరం టౌన్ :** మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో చంటి రాజు పినతల్లి అల్లూరి సత్యవతమ్మ ఇటీవలే స్వర్గస్తులైయ్యారు. చంటి రాజు కుటుంబ సభ్యులను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సోమవారం (అంజిబాబు) పరామర్శించారు. ముందుగా సత్యవతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వ్యక్తికి రూ.10 వేల జరిమానా : ఎస్ఐ

**ఆకివీడు :** ఇటీవల మద్యంతాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తిని కోర్టులో ప్రవేశపెట్టడంతో అతనికి న్యాయమూర్తి రూ.10 వేల జరిమానా విధించారని ఎస్ఐ హనుమంత నాగరాజు తెలిపారు. భీమవరం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎంవిఎస్.రాజారావు ఈ జరిమానా విధించినట్లు సోమవారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఆయన సూచించారు.

## ఉద్యోగం ఇప్పిస్తానని..

**ఆకివీడు :** ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.4 లక్షల 60 వేలకు ఒక వ్యక్తి నిరుద్యోగి వద్ద తీసుకొని నెత్తిన టోపీ పెట్టిన సంఘటన ఇటీవల ఆకివీడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం కాట్రేనికోన మండలం పెనుమాలకు చెందిన ఎస్.రాంబాబు అనే వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని కొందరి వద్ద డబ్బులు వసూలు చేశాడు. తీరా ఇప్పించకపోగా మోసపోయామని తెలుసుకున్న వారిలో ఒకరైన మందపాడుకు చెందిన గండికోట వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హనుమంత నాగరాజు తెలిపారు.

## బంగారం అపహరణ

**నరసాపురం :** తీరంలో చైన్ స్నాచింగ్‌లు పెరిగిపోతున్నాయి. రెండు రోజుల వ్యవధిలో నరసాపురం రూరల్ స్టేషన్ లిమిట్స్‌లో రెండు చైన్ స్నాచింగ్‌లు జరిగాయి. బంగారం ధరలు పెరిగిపోవడంతో మహిళలు టార్గెట్‌గా దొంగలు చెలరేగిపోతున్నారు. గురువారం మండలంలోని యర్రంశెట్టివారి పాలెం గ్రామంలో చెన్ను లక్ష్మి మెడలో 20 గ్రాముల నల్లపూసల గొలుసును దుండగులు లాక్కెళ్లారు. తన భర్త వెంకటేశ్వరరావుతో కలిసి ఆసుపత్రికి వెళ్లి వెళ్తుండగా బైకుపై నుంచి వచ్చి అపహరించారు. తాజాగా భీమవరం మండలం వెంప గ్రామానికి చెందిన కొప్పర్తి వరలక్ష్మీ మెడలోని మంగళసూత్రం గొలుసును దుండగులు లాక్కెళ్లారు. తన భర్త వెంకటేశ్వరరావుతో కలిసి శనివారం రాత్రి భీమవరంలోని తన కుమార్తె ఇంటికి వెళ్లి వెళ్తుండగా పెద గురువు వద్ద బైకుపై నుంచి వచ్చి అపహరించారని మహిళ తెలిపింది. అది సుమారు నాలుగు కాసులు బరువు ఉంటుందని, దీనిపై ఆదివారం నరసాపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## బెల్ట్ షాపు నిర్వాహకుడు అరెస్టు

**తాడేపల్లిగూడెం :** అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ ఎస్ఐలు ఆర్.దొరబాబు, మురళీ మోహన్ రావు సిబ్బందితో కలిసి సోమవారం మండలంలోని పడాల గ్రామంలో దాడులు నిర్వహించి, బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఆరు డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# ప్రజారోగ్యానికి ఏదీ భరోసా..!

కలుషితమవుతున్న తాగునీరు

అన్ని గ్రామాల్లోకి విస్తరించిన ఆక్వా కల్చర్

భూగర్భ జలాల కలుషితంతో తాగు నీటిని

కొనుక్కోవాల్సిన దుస్థితి

అధికారులు స్పందించాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రక్షిత మంచినీటి వాటర్‌ట్యాంక్

మండలంలోని 18 గ్రామాల్లో నిడదవోలు-నరసాపురం గోదావరి పంట కాల్వకు ఆనుకుని ఉన్న మార్టేరు, నెగ్గిపూడి, వెలగలేరు గ్రామాలతో సహా అన్ని గ్రామాల్లోనూ తాగునీటి కొరతతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఆక్వా కల్చర్ విశ్వ రూపం దాల్చడం వల్ల ఒకర్ని చూసి మరొకరు ఈ ప్రాంతంలో రైతులు చేపలు, రొయ్యల సాగు వైపు మరలడం వల్ల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. బోర్లు, చేతి పంపుల ద్వారా వచ్చే నీటిలో సైతం ఉప్పునీటి ఆనవాళ్ల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల పేరుకు గోదావరి తీర ప్రాంతాలే అయినా.. తాగునీటి సమస్య తప్పడం లేదు. ఆర్వో ప్లాంట్‌లలో 20 లీటర్ల మంచినీటి డబ్బాలని డబ్బులు పెట్టి కొనుక్కోవలసి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో పెద్ద గ్రామాల్లో ఒకటైన పొలమూరు గ్రామ పంచాయితీ ఏరియాలో మూడు రక్షిత మంచినీటి వాటర్ ట్యాంకులు ఉన్నాయి. వీటికి సమీపంలో రొయ్యల చెరువులు ఉండడం వల్ల తాగడానికి పనికి రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో మూడు ఆర్వో వాటర్ ప్లాంట్‌లలో ఏ ఒక్కదానికి ఇండియన్ గవర్నమెంట్ సర్టిఫికెట్ లేదని, ఈ నీరు తాగటం వల్ల కీళ్ల నొప్పులు, వాపులతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నది అందరి ఆరోపణలు. 2014లో ఎస్‌సి దళితపేటలోని రక్షిత మంచినీటి పథకంలో ఎన్ఆర్‌డబ్ల్యుసి నిధులు రూ.16 లక్షల వ్యయంతో వాటర్‌ట్యాంక్ 40 వేల లీటర్ల కెపాసిటీతో మంజూరైంది. దాన్ని పంచాయతీ వారు ఎస్‌సి ఏరియాలో నిర్మించకుండా అగ్రవర్ణాల ఏరియాలో నిర్మించారని స్థానికులు ఆరోపించారు. ప్రభుత్వం వారు స్పందించి ఎస్‌సి ఏరియాలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా వాటర్ ట్యాంక్ నిర్మించవలసిందిగా వారు కోరుతున్నారు. ఈ విషయం గురించి మండలంలోని ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌ఛార్జి ఎఇ ఎం.శ్యామ్ మణికంఠను ప్రజాశక్తి వివరణ కోరగా.. మండలంలో వేసవి కాలంలో నీటి కొరత లేకుండా ఏప్రిల్ నెలలోనే తగు చర్యలు తీసుకున్నామన్నారు. తాగునీటి చెరువులు ఉన్న పెనుమంట్ర, భట్లమగటూరు, ఓడూరు, నెలమూరు, జుత్తిగ, కొయ్యేటి పాడు గ్రామాల్లో చెరువులతో పాటు అన్ని గ్రామాల్లో రక్షిత మంచినీటి ట్యాంకులు శుభ్రం చేసామన్నారు. చెరువులు లేని చోట బోర్లు ద్వారా నిరంతరం నీరు అందిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. మార్టేరు పంచాయతీ సమీపంలో నూతనంగా నిర్మించిన మంచినీటి ట్యాంక్ త్వరలో ప్రారంభం అవుతుందని అన్నారు.

### ప్రజారోగ్యాన్ని పెంచాలి

**పిఎన్‌వి.ప్రసాద రావు, విశ్రాంత టీచర్, వనంపల్లి**

మండలంలో విచ్చలవిడిగా పెరిగిన ఆక్వా చెరువులకు అధికారులు చెక్ పెట్టి, ప్రజల ఆరోగ్యం పెంచాలి. మార్టేరు, నెగ్గిపూడి, వనంపల్లి, సత్యవరం, కొయ్యేటి పాడు పంచ గ్రామాల్లో మంచినీటి వనరులు ఉన్నా వాటిని ప్రభుత్వ యంత్రాంగం సరైన విధంగా నిర్వహించడం లేదు. ప్రతీ గ్రామంలో తాగునీరు కొనుక్కోవాలి అంటే సామాన్య ప్రజలకు తీరని ఆర్థిక భారం.

### రక్షిత నీరు ఉప్పగా ఉంటోంది

**కె.మధుకుమార్ బాబు, రైతు, పొలమూరు**



మండలంలోని పొలమూరు గ్రామంలో ఎస్‌సి ఏరియాలో ఎన్నో సంవత్సరాల నుంచి మంచినీటి కష్టాలు ఉన్నాయి. ఎన్నిసార్లు పంచాయతీలో మొరపెట్టుకున్నా స్పందన లేదు. గ్రామంలో రక్షిత మంచినీరు సైతం ఉప్పగా ఉంటోంది. చుట్టుపక్కల వ్యవసాయ భూముల్లో ఎక్కువగా ఆక్వా సాగు సాగుతుంది. దీనిని అధికారులు నియంత్రించాలి.

## ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

**పాలకొల్లు రూరల్ :** మండలంలోని యాళ్లవాణి గరువులో సోమవారం మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీలకు మండల తహశీల్దార్ ఎడ్ల దుర్గా కిషోర్, టిడిపి మండల కార్యదర్శి పాముల రజినీకుమార్ మజ్జిగ, కూల్ డ్రింక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పాలకొల్లు రూరల్ మాజీ సర్పంచి దొడ్డ శ్రీనివాసరావు, టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి అంబటి శేషగిరి, టిడిపి నాయకులు దిండి లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

మన రామానాయుడు మన పాలకొల్లు కార్యక్రమంలో భాగంగా పెదమామిడిపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశానుసారం జనసైనికులు సోమవారం కూల్ డ్రింక్స్, అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రచారవిభాగం కోఆర్డినేటర్ తులా రామలింగేశ్వరరావు, చేబ్రోలు కృష్ణమోహన్, మల్లిపూడి జగదీశ్, పరిం వెంకట నవీన్, కడలి స్వామి వెంకటాద్రి, గోగులమటం గణేష్, వర్ధినీడి నరేష్ పాల్గొన్నారు.


ఎన్నికైన నూతన కార్యవర్గం

## నరసాపురం పెయింటర్స్, ఆర్టిస్ట్ సంఘం ఎన్నిక

### అధ్యక్షునిగా పిండి ఆదినారాయణ ఏకగ్రీవం

**నరసాపురం :** పట్టణంలోని లయన్స్ కమ్యూనిటీ హాలులో జిల్లా పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నరసాపురం పెయింటర్స్, ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం జరిగింది. పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్ సంక్షేమ సంఘ అధ్యక్షుడుగా పిండి ఆదినారాయణను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా సంఘ ప్రధాన కార్యదర్శిగా మలిపెద్ది చంద్రశేఖర్, కోశాధికారిగా పర్వతం సత్యనారాయణ, గౌరవ సలహాదారులుగా డి.సుధాకర్, కార్యవర్గ సభ్యులుగా పలువురు సభ్యులు ఎన్నికయ్యారు. నరసాపురం పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ సంఘ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన పిండి ఆదినారాయణతో పాటు కార్యవర్గాన్ని జిల్లా కార్యవర్గ సభ్యులు పరిమి రామకృష్ణ(భీమవరం), బాబు రాజేంద్రప్రసాద్(తణుకు), తాళ్ల బాలసుబ్రమణ్యం(బాలు), కోరుకొండ సుబ్బారావు, నీలం రవి, భద్రం(పాలకొల్లు), సిరిపురపు వేణు, ఓల్పు వెంకటరమణ, ఆచంట మహేష్, చిగురుపాటి మాణిక్యాలరావు, అలిబిల్లి రాజేష్ (భీమవరం) పూలదండలు వేసి పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

## ఎన్‌టిఆర్ అవార్డు పొందడం అభినందనీయం

### మంత్రి నిమ్మల రామానాయుడు

**పాలకొల్లు :** ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా సూర్యచంద్ర కల్చరల్ అండ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా హైదరాబాద్‌లో ఎన్‌టిఆర్ ఎక్సలెన్స్ అవార్డులు పొందిన గుడాల హరిబాబు, వడ్లమాని హరికృష్ణలను రాష్ట్ర జలవనురుల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అభినందించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లు అయిన పాలకొల్లు పేరును కళాకారులుగా నిలబెడుతున్నారని, అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎన్‌టిఆర్ పేరున అవార్డులు రావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు పట్టణ నటీనట సంక్షేమ సమాఖ్య కళాకారులు గండేటి వెంకటేశ్వరరావు, విన్నకోట వెంకటరమణ, రావూరి అప్పారావు, తాతాబత్తుల వెంకటేశ్వరరావు, శివాల రామారావు, పుచ్చల నాగలింగేశ్వరరావు, కొంతేటి శాంతారావు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి : ఆర్‌డిఒ

**నరసాపురం :** పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 36 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించడం జరిగిందని ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం ద్వారా ఫిర్యాదుదారుల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం :** తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక దరఖాస్తు వచ్చినట్లు తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ ఎం.ఏసుబాబు, మున్సిపల్ ఇంజనీర్ వైవి.రమణ, అసిస్టెంట్ కమిషనర్ డి.రవికుమార్, జి.సీతారాం, మేనేజర్ ఎం.రవి సుధాకర్, ఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.రాజు పాల్గొన్నారు.

## వీరభద్రరావు కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

**యలమంచిలి :** మండలంలోని కట్టుపాలెం మాజీ సర్పంచి జెట్టి వీరభద్రరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ నేపథ్యంలో జెట్టి వీరభద్రరావు కుమారుడు బాలాజీ, వారి కుటుంబ సభ్యులను సోమవారం వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి), వైసిపి మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్, ఎంపిపి భర్త, వైసిపి నాయకులు ఇనుకొండ రవి, వాలంటీర్ వింగ్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పాలపర్తి సందీప్, వివిధ గ్రామాల వైసిపి నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ వీరభద్రరావు గ్రామ సర్పంచిగా ఎన్నో గుర్తుండిపోయే పనులు చేసి గ్రామ ప్రజలలో ఎంతో పేరు సంపాదించారని గుర్తుచేశారు.

## అంగన్వాడీ కేంద్రంపై సర్పంచి భర్త రాజకీయం తగదు

### ఎంపిపి దిగమర్తి సూర్య కుమారి

**ఆచంట :** కరుగోరుమిల్లి అంగన్వాడీ కేంద్రం పూర్తయి వంద రోజులు కావస్తున్నా సర్పంచి భర్త ఆ కేంద్రానికి తాళం వేసి రాజకీయం చేస్తున్నారని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి ఆరోపించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయకుమారి మాట్లాడుతుండగా మధ్యలో కల్పించుకుని ఎంపిపి మాట్లాడుతూ కరుగోరు మిల్లులో అంగన్వాడీ కేంద్రం పూర్తయి వంద రోజులు కావస్తున్నా నేటికీ ప్రారంభించకపోవడానికి సర్పంచి భర్తే కారణమని, ఈ విషయాన్ని ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే ప్రారంభించాలని ఆమె అధికారులను కోరారు. గతంలో అంగన్వాడీ కేంద్రం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నడిపే వారిని, ఇప్పుడు అంగన్వాడీ కేంద్రం పూర్తయిన ప్రారంభించకపోవడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. కదరవల్లి గ్రామంలో మంచినీటి కొరత ఉందని వైస్ ఎంపిపి ఎర్రగుప్పల నాగరాజు ఆర్‌డబ్ల్యు అధికారిని ప్రశ్నించారు. మండలంలో పశువులకు సబ్సిడీపై దాణా అందజేయడానికి ముందుగా రైతులు డబ్బులు చెల్లించాలని పశువైద్యాధికారి ఫణికుమార్ తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా దమ్మ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. రూ.కోటి 10 లక్షలతో పంట కాలులను పూడికతీత పనులు చేపట్టినట్లు ఇరిగేషన్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పూర్ణ బాబ్జి, తహశీల్దార్ కనకరాజు, సర్పంచులు గుబ్బల మాధవరావు, ఎంపిటిసిలు బాలం లీలా సుబ్రహ్మణ్యం, ఏడిద రాజ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గడ్డి తప్ప మట్టి తీయడం లేదు : ఎంపిటిసిలు

**వీరవాసరం :** మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో జరుగుతున్న పనుల పట్ల మండల పరిషత్ సమావేశంలో పలువురు ఎంపిటిసిలు అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ చట్టంలో ఉపాధి పొందుతున్న కూలీలు పంట బోదెలలో గడ్డి తప్ప మట్టి తీయడం లేదని ఆరోపించారు. వీరవాసరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన ఎంపిడిఒ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపాలని కోరారు. అనంతరం శాఖల వారి సమీక్షలో ఉపాధి హామీ చట్టంలో పనులు జరుగుతున్న తీరు పట్ల ఎంపిటిసి అసంతృప్తి వ్యక్తంచేశారు. రైతులకు మేలు చూకూరే విధంగా పనులు పూర్తి చేయాలన్నారు. కూలీలు పనిచేసే చోట నీరిచ్చే ఏర్పాట్లు చేయడం లేదని, దీంతో కూలీలు సొమ్మసిల్లి పోతున్నారన్నారు. ఉపాధి పనులు చేపట్టే ప్రాంతాలలో ఆ ప్రాంత నీటి సంఘాల సభ్యులకు సమాచారం ఇవ్వాలని వీరవాసరం నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడు ఆకుల లీలాకృష్ణ కోరారు. తద్వారా ఉపాధి పనులను పర్యవేక్షిస్తూ పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేసేందుకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. పశువుల షెడ్లు నిర్మించుకున్న వారికి బిల్లులు చెల్లించకపోవడం పట్ల ఎంపిటిసి అసంతృప్తి వ్యక్తంచేశారు. టెక్నికల్ అసిస్టెంట్ వర్మ సమాధానం ఇస్తూ కొన్ని ప్రాంతాలలో ఉపాధి కూలీలు నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. అండలూరు సిడబ్ల్యుఎస్ ద్వారా ఏడు గ్రామాలకు తాగునీరు సరఫరా జరుగుతుందన్నారు. అందువల్ల గ్రామ పంచాయితీ ఆదాయం కోల్పోయామంటూ ఎంపిటిసి బొల్లేంపల్లి శ్రీనివాస్‌చౌదరి సమావేశంలో ప్రస్తావించారు. మరో గ్రామమైన వెంకటాపురానికి కూడా అండలూరు నుంచి నీటి సరఫరా చేయడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అండలూరులో నాలుగు వందల ఎకరాలకు సాగునీటికి ఇబ్బంది కలిగిస్తున్న కాలువకు అడ్డంగా ఏర్పాటు చేసిన పైపులైన్‌లను మార్చాలంటూ కోరారు. ఈనెల 10వ తేదీకి కాలువ పూడికతీత పనులు పూర్తి చేస్తామని ఇరిగేషన్ ఎఇ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడ్డా శ్రీరామచంద్రమూర్తి, ఎంపిటిసిలు వీరవల్లి కనకఉషారాణి, బోను జ్యోత్స్నదేవి, కొల్లేపర శ్రీనివాసరావు, అంగర కుటుంబరావు, పంజా మంగతాయారు, సర్పంచులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, గెడ్డం భారతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మలేరియాను అంతమొందించాలి

### మలేరియా అధికారి లక్ష్మణరావు

**తాడేపల్లిగూడెం :** మలేరియా వ్యాధికి సంబంధించి పూర్తి చికిత్స అందుబాటులో ఉందని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెంకటరామన్న గూడెం పరిధిలోని పెదతాడేపల్లిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల కార్యక్రమాన్ని, అవగాహనా సదస్సులను నిర్వహించారు. మలేరియా వ్యాధికి పూర్తి చికిత్స అందుబాటులో ఉందని, ఈ మలేరియా జ్వరాన్ని నిర్ధారించడానికి గోల్డెన్ మెథడ్ మైక్రోస్కోప్ ద్వారా నిర్ణయించడం జరుగుతుందని మలేరియా అధికారి తెలిపారు. ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకూ ప్రతి గ్రామంలోనూ, పట్టణాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. ప్రజలందరూ ఈ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని, అలాగే చలితో కూడుకున్నటువంటి జ్వరం లక్షణాలు ఉన్నట్లయితే అశ్రద్ధ చేయకుండా ప్రాథమిక పరీక్షలు సమీపంలోని హెల్త్ సెంటర్‌లోనూ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య పర్యవేక్షకులు లక్ష్మణరావు రావు, ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగిన వేసవి విజ్ఞాన తరగతులు

**నరసాపురం :** ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. విద్యార్థుల చేత పుస్తక పఠనం, పత్రిక పఠనం చేయించడం, ప్రిన్స్ ప్రవీణ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్ కంప్యూటర్ క్లాస్, మోటివేషనల్ క్లాస్, తదనంతరం 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' అంశం గురించి వ్యాసరచన పోటీ నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ జీవన్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా పాల్గొన్న 55 మంది విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, శ్రీనివాస్, సూర్యం బాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలన్నీ గ్రేడ్‌వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

**పెనుమంట్ర:** మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం 34వ రోజు కార్యక్రమంలో విశ్రాంత టీచర్ పి.సువర్ణ గౌరి పిల్లలతో యోగ చేయించారు. టెల్లింగ్ స్టోరీస్ కార్యక్రమం నిర్వహించి, పరిసరాల పరిశుభ్రత మీద వ్యాసరచన పోటీని గ్రంథాలయ మాస్టర్ పిటి శివకుమార్ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. శిబిరంలో బి.రేవంత్, కె.ప్రణీత్, కె.శ్రావ్య పాల్గొన్నారు.

## రహదారిపై మట్టిని తొలగించాలి : రైతులు

**నరసాపురం :** చిట్టవరం-గొంది గ్రామాలకు చెందిన సుమారు 800 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేసేందుకు ఉపయోగపడే శింగంశెట్టి పంట కాలువ పూడిక తీత పనులు ఇటీవల చేపట్టారు. కాలువను ఆనుకుని ఉన్న గ్రావెల్ రోడ్డును మట్టితో పూడ్చివేయడం పట్ల రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రావెల్ రోడ్డుపై వేసిన మట్టి వల్ల తాము పొలాలకు వెళ్లేందుకు, ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు రైతులు కోపల్లి నాగేంద్రకుమార్, పైడికొండల విజయకుమార్, పెద్దిరాజు, వర్ధనపు తాతరా, కోపల్లి వెంకన్న బాబు, చల్లా బాలాజీ, కె.వెంకటేశ్వరరావు జలవనరులశాఖ అధికారులను కోరారు. ఈ విషయమై జలవనరుల శాఖ డిఇఇ సిహెచ్.వెంకటనారాయణ మాట్లాడుతూ కాలువ గట్టు వెంబడి ఉన్న గ్రావెల్ రోడ్డుపై వేసిన మట్టిని సాగునీటి సంఘాల ద్వారా తొలగించేందుకు చర్యల తీసుకుంటామన్నారు.

## క్షయ వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సాయం

**పాలకొల్లు :** అల్లూరి సీతారామరాజు క్షత్రియ సేవాసమితి పాలకొల్లు వారి ద్వారా నలుగురు క్షయ రోగులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున సహాయం అందించారు. పాలకొల్లు క్షత్రియ పరిషత్ భవనంలో సోమవారం క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు చేకూరి సూరిబాబు, సెక్రటరీ డాక్టర్ కెవిఎస్ఎస్.వర్మ, ఇసి మెంబర్ చెరుకూరి సత్యనారాయణరాజు, పెనుమత్స బుద్ధరాజు, దండు బంగారాజు చేతుల మీదుగా అందించారు. పోడూరు గ్రామానికి చెందిన పొత్తూరి సీతమ్మ, జిన్నూరు గ్రామానికి చెందిన ఉద్దరాజు రాఘవేంద్ర రాజు, పూలపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ రాజు, శివదేవుని చిక్కాల గ్రామానికి చెందిన దాట్ల ప్రసాద్ రాజుకు అందజేశారు. పేషెంట్ల ఆర్థిక సహాయం చేసినందుకు అల్లూరి సీతారామరాజు క్షత్రియ సేవా సమితికి ధన్యవాదాలు తెలియజేశారు.

## 'ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి'

**నరసాపురం:** ప్రస్తుత కాలంలో పెరిగిన ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు కలుగుతుందని, ఇకముందు ప్లాస్టిక్ వాడకంపై తగు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని నరసాపురం రైల్వేస్టేషన్ మేనేజర్ గణపతి మధుబాబు పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే వారు నిర్వహిస్తున్న సే నో టూ సింగల్ యూస్ ప్లాస్టిక్‌పై సోమవారం నరసాపురం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ భూగర్భంలో కలిస్తే కొన్ని వేల సంవత్సరాలైనా అవి భూమిలోనే ఉంటాయన్నారు. దీంతో ప్రాణి కోటికి తీవ్రమైన హాని కలుగుతుందన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**తణుకు :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి బాధితులకు ఆర్థిక సాయం అందించడంలో రాష్ట్రంలోనే తణుకు నియోజకవర్గం ముందంజలో ఉందని టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ అన్నారు. తణుకు నియోజకవర్గంలోని 11 మందికి సోమవారం రూ.11.55 లక్షల విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూటమి నాయకులు అందజేశారు. మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మంత్రిరావు వెంకటరత్నం, ఎఎంసి మాజీ ఛైర్మన్ బసవా రామకృష్ణ, జనసేన పట్టణ అధ్యక్షులు కొమ్మిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**పాస్‌పోర్ట్ పోయినది**

మారపట్ల జ్యోతిర్మాయి, భర్త, ఏసుదాసు, డోర్ నెంబర్ 5-92, ఎస్సీ కాలనీ, స్కూల్ వద్ద, ఉప్పులూరు, ఉండి మండలం, ప.గో.జిల్లా,ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి 21-09-2010 న **J2326000** నెంబర్, పాస్ పోర్ట్ తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్ పోర్ట్ ను తీసుకొని ది 20-05-2025 న ఉండి నుంచి లంకల కోడేరు బస్ లో వచ్చి ఆటో లో పాస్ పోర్ట్ రెన్యూవల్ గురించి ఏజెంట్ వద్దకు రాగా నా ఒరిజినల్ పాస్ పోర్ట్ దారిలో పడిపోయింది. దారిలో ఎంత వెతికినను ఎక్కడా నాకు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ దొరకలేదు.కాబట్టి ఎవరికైనా దొరికితే నా పై అడ్రస్ కు ఇవ్వాల్సిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

**నా సెల్ నెంబర్: 95154 21283**

**పాస్‌పోర్ట్ పోయినది**

పశ్చిమగోదావరి జిల్లా, పోడూరు మండలం, పెనుమదం గ్రామానికి చెందిన నక్క జ్యోతి, భర్త: చక్రవర్తి, డోర్ నెం. 6-57, నకు చెందిన **U6948583** నెంబర్ గల పాస్పోర్ట్ పోయినది. పెనుమదం నుంచి వీసా నిమిత్తం మోటర్ సైకిల్‌పై వెళుతుండగా పాస్పోర్ట్ కలిగిన కవరు మార్గమధ్యంలో పడిపోయింది. ఆ కవర్లో విశాఖపట్నం వారి జారీచేసిన **U6948583** ఒరిజినల్ పాస్పోర్టు కలిగి ఉంది. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు సంప్రదించగలరు.

**నక్క జ్యోతి**
**భర్త: చక్రవర్తి**
**డోర్ నెం. 6-57, పశువుల ఆసుపత్రి వీధి,**
**పెనుమదం, పోడూరు మండలం,**
**ప॥గో॥జిల్లా - 534 267**
**సెల్ నెం: 72075 59243**

ప్రకటన

**మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి ఏలూరు వారి కోర్టులో**

**A.R.B.E.P. 170/2025**
**IN A.C.P. 73/2023**

బిట్వీన్
**M/S. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
**Rep. by its Authorized Signatory**
..డి. హెచ్. ఆర్/క్లయింట్
**AND**
**బట్‌రాజ్ నాగబాబు 2 అదర్స్**
...జె.డి. ఆర్/రెస్పాండెంట్స్

పై నంబరు గ్రంధములో జె.డి.ఆర్ 3 బట్‌రాజ్ రవీంద్ర, S/o. భాస్కరరావు, D.no. 9-40, గుండుగొలను, భీమడోలు మండలం అనువారికి నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది. 18-06-2025వ సం.రం తేది ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపకోగలరు. లేని యెడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**N.V. సత్యనారాయణ**
**Ch. సౌందర్య**
ఏలూరు
ది.02-06-2025 అడ్వకేట్స్, ఏలూరు

ప్రకటన

**మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి ఏలూరు వారి కోర్టులో**

**A.R.B.E.P. 168/2025**
**IN A.C.P. 170/2023**

బిట్వీన్
**M/S. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
**Rep. by its Authorized Signatory**
..డి. హెచ్. ఆర్/క్లయింట్
**AND**
**కొలిశెట్టి జయ కిషోర్ 2 అదర్స్**
...జె.డి. ఆర్/రెస్పాండెంట్స్

పై నంబరు గ్రంధములో జె.డి.ఆర్ 3వ పెద్దిరెడ్డి బాలకృష్ణ S/o. సూర్యచంద్రరావు, D.no. 17-73, ఎమ్.ఎమ్ పురం, పూళ్ళ, భీమడోలు అనువారికి నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది. 20-06-2025వ సం.రం తేది ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపకోగలరు. లేని యెడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**N.V. సత్యనారాయణ**
**Ch. సౌందర్య**
ఏలూరు
ది.02-06-2025 అడ్వకేట్స్, ఏలూరు

ప్రకటన

**మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి ఏలూరు వారి కోర్టులో**

**A.R.B.E.P. 169/2025**
**IN A.C.P. 758/2021**

బిట్వీన్
**M/S. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
**Rep. by its Authorized Signatory**
..డి. హెచ్. ఆర్/క్లయింట్
**AND**
**వేమరెడ్డి సత్యనారాయణ 2 అదర్స్**
...జె.డి. ఆర్/రెస్పాండెంట్స్

పై నంబరు గ్రంధములో జె.డి.ఆర్స్/రెస్పాండెంట్స్, జె.డి.ఆర్ 3 అయిన వేమరెడ్డి సత్యనారాయణ S/o. సోమేశ్వర, D.no. 2-72, సంతమార్కెట్, ద్వారకా తిరుమల అనువారికి నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది. 17-06-2025వ సం.రం తేది ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపకోగలరు. లేని యెడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**N.V. సత్యనారాయణ**
**Ch. సౌందర్య**
ఏలూరు
ది.02-06-2025 అడ్వకేట్స్, ఏలూరు